వైభవంగా ఆలయాల పునఃప్రతిష్ఠాపనోత్సవం



వేడుకల్లో విక్రమ్‌గౌడ్, నాగ్ధర్ తదితరులు

అబిడ్స్: న్యూ ఉస్మాన్‌గంజ్‌లోని నల్లపోచమ్మ, ఎల్లమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్ల ఆలయ పునః ప్రతిష్ఠాపనోత్సవం వైభవంగా జరిగింది. మాజీ మంత్రి దివంగత ఎం.ముఖేష్‌గౌడ్ తనయుడు ఎం.విక్రమ్‌గౌడ్ దంపతులు ఈ ఆలయ పునర్ నిర్మాణంను చేపట్టి భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. మూడు రోజులుగా జరుగుతున్న ఈ వేడుకల్లో శుక్రవారం విక్రమ్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముఖ్యంగా అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపన, మంత్ర ప్రతిష్ఠ కళ్లస్లాసం, నేత్రాన్మళనమం, దిష్టికుంభం, అమ్మవార్ల దివ్య దర్శనం, కుంభాభిషేకం, మహాదాశీర్వచనం తదితర కార్యక్రమాలు జరిగాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు సీకే మూర్తి ఆధ్వర్యంలో గోపూజ, పుణ్యాహ వచనం, దీక్షాధారం, అంకురార్పణ, పంగగవ్య ప్రాశన, యాగశీల ప్రదేశం, నవగ్రహ క్షేత్రపాలక స్థాపన, అగ్నిప్రతిష్ఠ మహాగణపతి హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విక్రమ్‌గౌడ్ మాట్లాడుతూ..దివంగత ముఖేష్‌గౌడ్ జ్ఞాపకార్థమై గోషామహల్ నియోజకవర్గం లో మొత్తం 21 ఆలయాలను గుర్తించి అక్కడ పునర్ నిర్మాణం పను లు చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటికే కట్టెలమండిలో, పటేల్‌నగర్‌లో, ఉస్మాన్‌గంజ్‌లో మూడు ఆలయాలు పూర్తిస్థాయిలో పునర్ నిర్మింపజేసి పునఃప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.

తెలంగాణ సారస్వత దిక్సూచి సురవరం ప్రతాప్‌రెడ్డి



డాక్టర్ జిల్లేల చిన్నారెడ్డికి పురస్కారం ప్రదానం చేస్తున్న ఎల్లూరి శివారెడ్డి తదితరులు

సుల్తాన్‌బజార్: తెలంగాణ సారస్వత దిక్సూచి సురవరం ప్రతాప్‌రెడ్డి అని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లేల చిన్నారెడ్డి అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్‌లో తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో బహుముఖ ప్రజ్ఞాశాలి సురవరం ప్రతాప్‌రెడ్డి గ్రంథ స్వీకర్తగా పాల్గొని ప్రసంగించారు. డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై గ్రంథాన్ని ఆవిష్కరించారు. అతిథులుగా ఆచార్య వి.బాలకృష్ణారెడ్డి, డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, సూరవరం కుమారుడు సూరవరం కృష్ణ వర్ధన్‌రెడ్డి పాల్గొనగా, భాషా సాంస్కృతిక మండలి అధ్యక్షుడు డాక్టర్ గంటా జలంధర్‌రెడ్డి స్వాగతోపాన్యాసం చేయగా డాక్టర్ పోరెడ్డి గంగయ్య కార్యక్రమ సమన్వయం చేశాడు. సాహితీ ప్రముఖులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మజ్లిస్ పార్టీ భారీ మెజార్టీతో గెలుస్తుంది: అక్బరుద్దీన్



రోడ్ షోలో మాట్లాడుతున్న అక్బరుద్దీన్ ఒవైసీ

గోల్కొండ: హైదరాబాద్ ఎంపీ స్థానాన్ని తమ పార్టీ భారీ మెజార్టీతో గెలుస్తుందని మజ్లిస్ పార్టీ శాసన సభ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. శుక్రవారం ఆయన కార్వాన్ నియోజకవర్గంలోని నానల్‌నగర్, టోలిచౌకీ, గోల్కొండ తదితర డివిజన్లలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేసింది మజ్లిస్ పార్టీనే అని అన్నారు. మజ్లిస్ పార్టీ పనితనాన్ని చూసి కొన్ని పార్టీల వారు ఓర్వలేకపోతున్నారని, అందువల్లే ఆ పార్టీల వారు అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్ నగరం అంటే మతసామరస్యానికి, ప్రజల మధ్య స్నేహ సంబంధాలకు పెట్టింది పేరని అన్నారు. అయితే హైదరాబాద్ నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు కుట్రలు పన్నుతున్న వారి ఆటలను సాగనివ్వమని ఆయన పేర్కొన్నారు. ఈసారి హైదరాబాద్ నుంచి మజ్లిస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్, కార్పొరేటర్ నసీరుద్దీన్, నాయకులు ఆలీముద్దీన్, హారూన్‌ఫరాన్, ఏకే పఠాన్, వజీఉజ్‌జమా, అబీబ్‌పాస్, ముజీబ్ తదితరులున్నారు.

కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న అరుణ్‌కుమార్, కొత్త కురుమ శివకుమార్

అబిడ్స్: కురుమ కులస్తులకు ప్రభుత్వం కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర కురుమ యువజన సంఘం అధ్యక్షుడు, గ్రేటర్ కాంగ్రెస్ నాయకుడు తూంకుంట అరుణ్‌కుమార్, టీపీసీసీ కార్యదర్శి కొత్త కురుమ శివకుమార్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో ఉన్న లక్షలాది మంది కురుమలు అండగా ఉండి పార్టీ అధికారంలోకి వచ్చే విధంగా ఎంతో కృషి చేశారన్నారు. గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ..కురుమలకు నామినేటెడ్ పదవుల్లో కూడా తగిన ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి ఇచ్చి కురుమలకు న్యాయం చేయాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎంపీ ఎన్నికల్లో ప్రతి కురుమ కులస్తుడు కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు నడుం బిగించాలన్నారు. ఈనెల 29న కురుమ కులస్తులు నిర్వహించే ఆత్మీయ సమ్మేళనంలో పెద్ద ఎత్తున కురుమలు పాల్గొనాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కురుమ కులస్తులకు ఎన్నో విధాల సహకారం అందిస్తుందని, మిగతా కులస్తుల సమస్యలు కూడా పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చౌదరిపల్లి పర్వతాలు, కొంగొల్ల పాండు, గొరిగే మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పాతబస్తీలో దక్షిణ మండలం డీసీపీ పర్యటన



మక్కా మసీదులో బందోబస్తును పరిశీలిస్తున్న దక్షిణ మండలం డీసీపీ స్నేహ మిశ్రా

చార్మినార్: ఉత్తరాఖండ్‌కు చెందిన స్నేహ మెహ్రా హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని దక్షిణ మండలం డీసీపీగా బాధ్యతలు చేపట్టారు. పాతబస్తీలో మొదటి మహిళా ఐపీఎస్ అధికారిగా ఆమె విధినిర్వహణలో చేరారు. ఐపీఎస్ 2018 బ్యాచ్‌కు చెందిన ఆమెను ఎన్నికల కమిషన్ నియమించింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసి వెంటనే బాధ్యతలు చేట్టాలని ఆదేశించడంతో శుక్రవారం ఆమె పురానీ హవేలీలోని డీసీపీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ డీసీపీగా పని చేసిన పోతురాజు సాయి చైతన్యను ఎన్నికల కమిషన్ బదిలీ చేసిన విషయం తెలిసిందే. బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆమె దక్షిణ మండలం అదనపు డీసీపీ షేక్ జహంగీర్‌తో కలిసి చార్మినార్, మక్కా మసీదులో పర్యటించి బందోబస్తును పరిశీలించారు. మక్కా మసీదులు శుక్రవారం జుమ్మా సామూహిక ప్రార్థనలు జరుగుతాయి.. ఆ విషయాలను అడిగి తెలుసుకున్నారు. బందోబస్తు వివరాలను షేక్ జహంగీర్ ఆమెకు వివరించారు.

బీజేపీ, మజ్లిస్ పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలి



గోషామహల్‌లో ప్రచారం చేస్తున్న గడ్డం శ్రీనివాస్‌యాదవ్, ధన్‌రాజ్, జయశంకర్ తదితరులు

అబిడ్స్: మతం పేరు చెప్పి ఓట్లు దండుకునే బీజేపీ మజ్లిస్ పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలని హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం గోషామహల్, జాంబాగ్, తోఫ్‌ఖానా, శంకర్‌బాగ్, పోలీస్ క్వార్టర్స్ ప్రాంతాల్లో ఆయన ఇంటింటి ప్రచారం చేసి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ..గత పదేళ్లుగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం హైదరాబాద్‌లో వందల కోట్ల అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు. ఎన్నికలు వచ్చాయంటే ప్రజల ముందుకు మతం తెచ్చి బీజేపీ, మజ్లిస్ పార్టీలు నాటకాలాడుతున్నాయన్నారు. ప్రజలు గమనించాలన్నారు. అభివృద్ధి కావాలంటే బీఆర్‌ఎస్ కావాలన్నారు. తనను గెలిపిస్తే హైదరాబాద్ నియోజకవర్గాన్ని దేశంలోని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. ఎన్నో సంవత్సరాలుగా హైదరాబాద్ ఎంపీగా ఉన్న అసదుద్దీన్ ఒవైసీ ప్రజలకు ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. మైనార్టీలకు అసత్య ప్రచారం చేసి వారితో ఓట్లు దండుకుంటున్న ఒవైసీకి ప్రజలు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారన్నారు. బీజేపీ అభ్యర్థి మాధవీలత అసత్య ప్రకటనలు ప్రజలు నమ్మొద్దన్నారు. బీజేపీ, మజ్లిస్ అభ్యర్థులు కేవలం అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపిచారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ధన్‌రాజ్ యోగేష్, జయశంకర్‌తో పాటు వందలాది మంది పాల్గొన్నారు.

కాలుష్య రహిత నిర్మాణాల సాధనకు కృషి చేయాలి



అంతర్జాతీయ సదస్సును ప్రారంభిస్తున్న క్రిష్ణమూర్తి



వీడియో కాన్ఫరెన్స్‌లో మలేషియా నుంచి డాక్టర్ జాన్సన్ యు అలెంగర్

లంగర్‌హౌస్: కాలుష్య రహిత నిర్మాణాల సాధనకు ప్రతి ఇంజినీర్ కృషి చేయాలని మలేషియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ జాన్సన్ యు అలెంగర్ అన్నారు. వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం 3వ అంతర్జాతీయ సదస్సును వాసవీ ఎడ్యుకేషన్ అఫ్ అకాడమీ కార్యదర్శి క్రిష్ణమూర్తి శుక్రవారం ప్రారంభించారు. సివిల్ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అడ్వాన్స్ ఇన్ కాంక్రీట్ అండ్ కన్‌స్ట్రక్షన్ ఇంజినీరింగ్ ఫర్ సుస్థైనబిలిటీ–ఐసీఏసీసీ 2024 పేరుతో నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ సదస్సులో మలేషియా, ఆస్ట్రేలియా, వియాత్నం దేశాల నుంచి ఇంజినీరింగ్ ప్రముఖులు, ప్రొఫెసర్లతో పాటు భారతదేశంలోని వివిధ రాష్ట్రాల యూనివర్సిటీల ప్రొఫెసర్లు ప్రత్యక్షంగా, వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న మలేషియా ప్రొఫెసర్ జాన్సన్, ఆస్ట్రేలియా నుంచి కన్సల్టెంట్ ఇంజినీర్ బిందుమాధవ్ భారతదేశం నుంచి 36 ప్రతిపాదనలు విన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అభివృద్ధిలో దూసుకుపోతున్న భారతదేశంలో కాలుష్య రహిత నిర్మాణాల దిశగా ముందుకు వెళ్తూ ప్రపంచ దేశాలకు మరింత ఆదర్శంగా నిలవాలన్నారు. ప్రస్తుతం వాడుతున్న సిమెంట్‌లో 900 గ్రాముల కార్బన్‌డై ఆక్సైడ్ ఉత్పత్తి అవుతుందని, భావితరాలకు ఇది అత్యంత ప్రమాదకరమన్నారు. సిమెంట్‌కు బదులుగా ప్రత్యామ్నాయ మార్గాలను నేటి ఇంజినీర్లు ప్రపంచానికి పరిచయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జైపూర్‌కు చెందిన పూర్ణిమ ఇంజినీరింగ్ కళాశాల ఈ సదస్సును భాగస్వామ్యంగా నిర్వహించగా వాసవీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వి.రమణ, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ఎంవీఎస్ఎస్ శాస్త్రి పాల్గొన్నారు.

నేడు సెయింట్ ఆన్స్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే

గోల్కొండ: ఈనెల 27న గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్నామని మెహిదీపట్నంలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ఏ.విజయరాణి అన్నారు. కళాశాలలోని సెయింట్ జోసెఫ్ ఆడిటోరియంలో శనివారం 11గంటలకు ఈ వేడుకలు ప్రారంభమవుతాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమం రివరెండ్ సిస్టర్ పి.ఆంథోనమ్మ పర్యవేక్షణలో జరుగుతుందని ఉస్మానియా యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఎం.రాములు ముఖ్య అతిథిగా హాజరుతారన్నారు.

ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్ట్

జియాగూడ: ఆన్‌లైన్‌లో ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి రూ.22 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ రామస్వామి తెలిపారు. శుక్రవారం ఆయన వివరాలను వెల్లడించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని కార్వాన్ బాంజావాడిలో అక్రమంగా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారంతో కుల్సుంపురా పెట్రోలింగ్ కానిస్టేబుల్స్ శివప్రసాద్, మహ్మద్ అబ్దుల్ ఖయూమ్ ఓ ఇంటిపై దాడి చేశారు. కాగా అంబటి శ్రీకాంత్(36) ఇంటి నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. కోల్‌కత్త నైట్ రైడర్, పంజాబ్ కింగ్ మధ్య నడుస్తున్న క్రికెట్‌ను ఆన్‌లైన్‌లో బెట్టింగ్ నిర్వహిస్తూ డబ్బు సంపాదిస్తున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


హెచ్‌సీయూకు ఇండియన్ పేటెంట్ మంజూరు



పేటెంట్ పొందిన ప్రొ.రాజదురై చంద్రశేఖర్, విద్యార్థి డా.వినయ్‌ప్రదీప్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి ఇండియన్ పేటెంట్ మంజూరు చేశారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీ నుంచి ప్రొఫెసర్ రాజదురై చంద్రశేఖర్, అతని పూర్వ పీహెచ్‌డీ విద్యార్థి డాక్టర్ వప్పు వినయ్ ప్రదీప్‌కు 'మాలిక్యులర్ సింగిల్–క్రిస్టల్ ఫోటోనిక్ మైక్రో–రెసోనాటర్స్ అండ్ ఫర్మేథింగ్ పర్మేషన్ ఆవిష్కరణ కోసం భారతీయ పేటెంట్ చేయబడింది. పేటెంట్ చట్టం 1970లోని నిబంధనలకు అనుగుణంగా 20 సంవత్సరాల కాలానికి ఈ పేటెంట్‌ను అందించారు. ప్రస్తుత ఆవిష్కరణ అనేక ఫోటోనిక్ అప్లికేషన్‌లలో ఉపయోగపడే పరమాణు సింగిల్ క్రిస్టల్‌తో కూడిన మైక్రో రెసోనేటర్‌లను అందిస్తుంది. ప్రొ.రాజదురై చంద్రశేఖర్ ఆర్గానిక్ సింగిల్–క్రిస్టల్ ఫోటోనిక్ భాగాలను రూపొందించే సాంకేతికతకు 'క్రిస్టల్ ఫోటోనిక్స్ ఫౌండ్రీ' అని పేరు పెట్టారు. ఇండియన్ పేటెంట్ పొందడం పట్ల పలువురు ప్రొఫెసర్లు వారిని అభినందించారు.

మహ్మద్ వలీ వుల్లా సమీర్ ను కలిసిన కేఎస్ ఆనంద్‌రావు



చార్మినార్: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ వలీ వుల్లా సమీర్ తప్పకుండా విజయం సాధిస్తారని టీపీసీసీ కార్యదర్శి కేఎస్ ఆనంద్‌రావు తెలిపారు. శుక్రవారం మహ్మద్ వలీ వుల్లా సమీర్ ను మర్యాదపూర్వకంగా కలిసి హైదరాబాద్ పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్టీ పరిస్థితులపై చర్చించినట్లు ఆయన తెలిపారు. ఆరు గ్యారంటీలే తమ పార్టీ అభ్యర్థి విజయానికి దోహదం చేస్తాయన్నారు. అన్ని వర్గాల ఓటర్లు తమ అభ్యర్థికి ఓట్లు వేసి గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

అభివృద్ధికి చిరునామా మజ్లిస్ పార్టీ: కౌసర్



గోల్కొండలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అభివృద్ధికి చిరునామా మజ్లిస్ పార్టీ అని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన గోల్కొండ డివిజన్‌లోని చోటాబజార్, బడా బజార్, ఖాజీ గల్లీ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి మజ్లిస్‌కి ఓటు వేయాలని ఓటర్లను కోరారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో అభివృద్ధి చేశామన్నారు. సాంకేతిక కారణాల వల్ల డ్రైనేజీ సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన అన్నారు. వెంటనే ఆ సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరిస్తున్నామన్నారు. హైదరాబాద్ ఎంపీ అభ్యర్థిగా మరోసారి పోటీ చేస్తున్న తమ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వృద్ధులు, వికలాంగులకు పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు ప్రత్యేక సౌకర్యాలు ఉన్నాయని అటువంటి వారు కూడా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి మజ్లిస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. ఆయన వెంట మజ్లిస్ నాయకులు ఆలీముద్దీన్, ముజీబ్, అహ్మద్ బిన్ మోసీన్ బాకుల్కా, అజీజ్‌ఖాన్ తదితరులున్నారు.

ఫరీన్ ముస్తాకు ఉత్తమ సేవా అవార్డు



సయ్యద ఫరీన్ ముస్తాకు మెమొంటో అందజేస్తున్న ఏసీపీ సయ్యద్ ఫయాజ్

గోల్కొండ: హైదరాబాద్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న భరోసా కేంద్రాలపై ప్రజలకు నమ్మకం పెరుగుతుందని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. గోల్కొండలోని హైదరాబాద్ పోలీస్ భరోసా కేంద్రంలో కౌన్సెలింగ్ నిర్వహించే సయ్యద ఫరీన్ ముస్తాకు శుక్రవారం ఉత్తమ సేవా అవార్డు అందించారు. కలహాలతో తన వద్దకు వచ్చిన ఎన్నో జంటలను కౌన్సెలింగ్ కోసం తాను సయ్యదా ఫరీన్ వద్దకు పంపించామన్నారు. వారికి విడతలుగా కౌన్సెలింగ్ నిర్వహిస్తూ ఎన్నో జంటలను ఏకం చేయడం సయ్యదా ఫరీన్ పనితీరుకు నిదర్శమన్నారు. గోల్కొండ జగదాంభిక మహంకాళీ ఆలయ వృత్తిపని సంఘం అధ్యక్షుడు సాయిబాబాచారి, ఆలయ పూజారి సురేష్‌చారి తదితరులున్నారు.



కాలేజ్ టాపర్స్‌తో ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య తదితరులు

అభినందనలు

గోల్కొండ: ఇంటర్ ఫలితాల్లో ప్రతియేటా తమ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారని శ్రీ మేధా కళాశాల డైరెక్టర్ పూర్ణచందర్, ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య తెలిపారు. ఈ సంవత్సరం ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాలలో అభినందించి సన్మానించారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో అశ్విని 986, బైపీసీలో విశాల్ 948, ఎంఈసీలో రాణియా అహ్మద్ 956, సీఈసీలో ప్రణిత్ 976 మార్కులు సాధించారని తెలిపారు. ప్రథమ సంవత్సరంలో ఎంపీసీలో ఎం.కిరణ్ 465, హరిణి 460, బైపీసీలో అమీనామీరాజ్ 432, వాక్‌దేవి 427, పూజిత 422 మార్కులు సాధించారని వారు అన్నారు. సీఈసీలో ఆకృతి 460, అంకిత్‌కుమార్ 458 మార్కులు సాధించారన్నారు.


కాంగ్రెస్‌లో చేరిన కనకయ్య ముదిరాజ్



జగ్గారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న కనకయ్య ముదిరాజ్ తదితరులు

అబిడ్స్: తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, బీఆర్‌ఎస్ నేత దమ్మిగారి కనకయ్య ముదిరాజ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన గాంధీ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సమక్షంలో తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి కనకయ్య ముదిరాజ్‌కు కాంగ్రెస్ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కనకయ్య ముదిరాజ్ మాట్లాడుతూ..సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీ అమలు, అభివృద్ధి పనుల పట్ల ఆకర్షితుడై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో చేరడంతో సొంత గూటికి చేరినట్లు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మలిదశ తెలంగాణ ఉద్యమకారులు రవీంద్రచారి, వెన్న సదానందం, నాడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో బీజేపీ విజయం ఖాయం



జాంబాగ్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మాధవీలత తదితరులు

సుల్తాన్‌బజార్: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఈసారి బీజేపీ జెండా ఎగరబోతుందని జాంబాగ్ బీజేపీ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ అన్నారు. శుక్రవారం జాంబాగ్‌లో బీజేపీ హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి మాధవీలత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాండ్ వాయిస్తూ ఓటర్లను ఆకట్టుకున్నారు. ఆమె మాట్లాడుతూ..హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో అసదుద్దీన్ ఒవైసీ ఓడిపోవడానికి సమయం వచ్చిందన్నారు. బోగస్ ఓట్లతో ప్రతి ఎలక్షన్‌లో నెగ్గుతూ వచ్చే ఒవైసీకి కేంద్ర ఎన్నికల సంఘం ద్వారా తొలగించగలిగామన్నారు. బీజేపీకి భయపడి ఎన్నో ఏళ్లుగా ప్రత్యర్థిగా ఉన్న ఎంపీటీసీ సైతం ఎన్నికల నుంచి తప్పుకునేల ఒవైసీ ప్రలోభ పెట్టారని ఆరోపించారు. ఒవైసీ తలకిందులుగా తపస్సు చేసిన ఈసారి బీజేపీ గెలుపు ఖాయం అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాండు యాదవ్, శశికళ, శ్రీనివాస్ యాదవడ్, గోపాల్, స్వామి దయానంద్, శ్రీధర్‌కుమార్ మరియు కాజల్, రేణుక, రామకృష్ణ, రఘుతో పాటు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

మోదీ మళ్లీ ప్రధానిగా రావడం ఖాయం



గుడిమల్కాపూర్‌లో కిషన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం

గోల్కొండ: మోదీ మళ్లీ ప్రధానిగా రావడం ఖాయమని సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన నాంపల్లి నియోజకవర్గంలోని మెహిదీపట్నం, గుడిమల్కాపూర్ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీ పదేళ్ల పాలనలో మోదీ సాధించిన విజయాలను వివరించారు. శాస్త్ర సాంకేతిక రంగాలతో పాటు ఆర్థిక రంగంలోనూ ఘనమీయమైన విజయాలు సాధించడం వెనుక ప్రధాని నరేంద్రమోదీ ఆలోచన ఉందని ఆయన అన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకు నిధులు కేటాయించడం, ప్రధాని మోదీ గొప్పతనం అని ఆయన అన్నారు. చేతివృత్తుల వారికి ప్రధాని ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా తనను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. నాంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి తాను ఎంతో కృషి చేశానన్నారు.

హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్‌దే విజయం



మంగళ్‌హాట్‌లో ప్రచారం చేస్తున్న మనోహర్ గైక్వాడ్ తదితరులు

అబిడ్స్: హైదరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే విజయమని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు, మహర్ సమాజ్, గోషామహల్ నియోజకవర్గం అధ్యక్షుడు మనోహర్ గైక్వాడ్ పేర్కొన్నారు. మంగళ్‌హాట్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం చేసి హైదరాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్‌ను గెలిపించాలని ఆయన ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. అనంతరం మాట్లాడుతూ..గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ పటిష్టంగా ఉందన్నారు. 10 ఏళ్ల కేసీఆర్ ప్రభుత్వ పథకాలతోనే విజయం సాధిస్తామన్నారు.

ఆలోచింపజేసిన నాటకోత్సవం



గన్‌ఫౌండ్రీ: పరుచూరి రఘుబాబు స్మారక 34వ జాతీయ స్థాయి నాటక పోటీలు ఎంతో ఆసక్తికరంగా సాగుతున్నాయి. గత రెండు రోజులుగా రవీంద్రభారతిలో జరుగుతున్న ఈ నాటక పోటీల్లో శుక్రవారం ప్రదర్శించిన నాటకాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. విజ్ఞాన భారతం, అమృత హస్తం, దారుణం వంటి నాటకాలు ఆలోచింపజేయగా పక్కింటి మొగుడు హాస్యాన్ని కలిగించింది. ఈనెల 27న నాటకాల్లో గెలుపొందిన బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందని సినీ నటుడు పరుచూరి గోపాలకృష్ణ తెలిపారు.

యాకుత్‌పురాలో జోరుగా మజ్లిస్ ప్రచారం




ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ తదితరులు

యాకుత్‌పురా: యాకుత్‌పురా నియోజకవర్గంలో మజ్లిస్ పార్టీ తమ ఎన్నికల ప్రచారాన్ని జోరుగా కొనసాగిస్తోంది. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి పార్టీ ముఖ్య నాయకులు ఎమ్మెల్యే, కార్పొరేటర్లు తమదైన శైలిలో ప్రచారం నిర్వహిస్తున్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు శాసనసభ నియోజకవర్గాల్లో యాకుత్‌పురా మజ్లిస్ పార్టీకి ప్రధాన కంచుకోటగా మారింది. పార్టీ అధినేత, ఎంపీ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ, శాసనసభ పక్ష నాయకుడు అక్బరుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్సీ మీర్జా రియాజుల్ హసన్ అఫాందీ, ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్, మేరాజ్ పలు డివిజన్లల్లో ప్రచారం, బహిరంగా సభలు నిర్వహిస్తూ ఓటర్లను విశేషంగా ఆకట్టుకుంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ సైతం ప్రతిరోజూ ఉదయం సాయంత్రం వేళల్లో అన్ని ప్రాంతాల్లో ఇంటింటికీ తిరుగుతూ మజ్లిస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు. యాకుత్‌పురాలో భారీ మెజార్టీ సాధించేందుకు పార్టీ అధి నాయకత్వం ముందుకు దూసుకెళ్తుంది.

'గో కార్టింగ్' పోటీల్లో సీబీఐటీ విద్యార్థుల ప్రతిభ

మణికొండ: అమెరికన్ సొసైటీ ఆఫ్ మెకానికల్ ఇంజినీర్స్(ఏఎస్ఎంఈ)కు అనుబంధంగా ఉన్న ఇంజినీరింగ్ క్లబ్‌లో జరిగిన గో కార్టింగ్ పోటీల్లో సీబీఐటీ కళాశాల విద్యార్థులకు మొదటి బహుమతి దక్కింది. జేఎన్‌టీయూహెచ్ ఆధ్వర్యంలో సుల్తాన్‌పూర్‌లో గురువారం జరిగిన పోటీల్లో సీబీఐటీ విద్యార్థులు తయారు చేసిన గో– కార్టింగ్ కారు అందరినీ ఆకర్షించి బహుమతిని అందుకుంది. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. మెకానికల్ ఇంజినీరింగ్ రంగంలో పరిశోధన, సృజనాత్మకత, డిజైన్ పోటీల్లో పాల్గొనడం ప్రపంచ ఇంజినీరింగ్ అనుభవాన్ని పొందడంలో సహాయపడుతుందన్నారు. మెకానికల్ ఇంజినీరింగ్ హెచ్‌ఓడీ ప్రభాకర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి



ఆలయ స్థలాన్ని జేసీబీతో చదును చేస్తున్న దృశ్యం

జియాగూడ: ఎల్లమ్మ ఆలయ భూమిని ఆక్రమదారులు కబ్జా చేస్తున్నారని ఆలయ అధ్యక్షుడు కట్ట రాజయ్య, ప్రస్తుత అధ్యక్షుడు గుర్రం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఉపాధ్యక్షులు రాజేందర్ కుమార్ డెగాన్, కోశాధికారి చెర్క బాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం కుల్సుంపురా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..కుల్సుంపురా 2జీ బస్టాప్ వద్ద గల ఎల్లమ్మ ఆలయానికి సంబంధించిన ఖాళీ స్థలం ఉంది. అందులో కొందరు కబ్జాచేసి జేసీబీల సాయంతో భూమిని చదును చేసి ప్రహరీ నిర్మాణానికి తవ్వకాలు చేపడుతున్నారన్నారు. ఈ విషయమై కుల్సుంపురా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఏసీపీ మునావర్, ఇన్‌స్పెక్టర్ రామస్వామి ఘటన స్థలానికి చేరుకుని పనులు నిలిపివేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఆలయ స్థలానికి సంబంధించిన కేసు కోర్టులో నడుస్తుందని తదుపరి వాయిదా జూన్ 4న ఉండగా, కొందరు ఇక్కడ కబ్జాలకు పాల్పడుతున్నారని, కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అదేవిధంగా ఈ స్థలం మొత్తానికి సంబంధించి తహసీల్దార్, అధికారుల ద్వారా ఆ స్థలం, చుట్టుపక్కల ఇండ్లపై కూడా సమగ్రమైన సర్వే నిర్వహించాలని కోరారు.